వంతెన.. ప్రమాదాల చెంతన



ఇనుప ప్లేట్లు చెల్లా చెదురవ్వడంతో ఏర్పడిన గుంతలు

జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీ- లంకెలపాలెం అనుసంధాన రహదారిలో వంతెన అంతుకులబొంతగా మారింది. ఫలితంగా వాహనచోదకులు భీతిల్లుతున్నారు. వంతెనపై గాలి బీటలు పడకుండా ప్రతీ పది మీటర్లకు ఖాళీ ఉంచారు. అలాంటి చోట ఇనుప రాడ్లు, ప్లేట్లు అమర్చారు. అయితే అవి విరిగిపోయి ప్రమాదభరితంగా మారాయి.

- రాకపోకలకు భీతిల్లుతున్న వాహనచోదకులు
- ప్రమాదకరంగా ఇనుప ప్లేట్లు
- భయపెడుతున్న గోతులు



రహదారిలో గుంతలు

అగనంపూడి: లంకెలపాలెం వంతెన మీదుగా నిత్యం వేలాది భారీ వాహనాలతో పాటు వేలాది ద్విచక్ర వాహనచోదకులు రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే పరిసర గ్రామాలు, పరవాడ ప్రాంతం నుంచి ఈ మార్గంలో వేలాది మంది నిత్యం ప్రయాణం చేస్తున్నారు. అయితే రైల్వే క్రాసింగ్ వద్ద 15 ఏళ్ల కిందట నిర్మించిన వంతెన ఇప్పుడు ప్రమాదాలకు నిలయంగా మారింది. తరచూ గ్యాప్‌ల వద్ద ఇనుప ప్లేట్లు చెల్లా చెదురవుతుండడంతో పాటు ఇనుప చువ్వలు పైకి తేలిపోయి వాహనాల టైర్లను కోసుకుపోయేలా చేస్తున్నాయి. అలాగే వంతెనపై రహదారి ఎక్కడికక్కడే గోతులతో నిండిపోవడంతో ప్రయాణికులు నెమ్మదిగా ప్రయాణం చేయాల్సి వస్తుంది. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో వంతెనపై భారీ స్థాయిలో వాహనాలు నిలిచిపోతున్నాయి. ఫార్మా కంపెనీల నుంచి విధులు ముగించుకొని వెళ్లే సమయం, విధులకు హాజరయ్యే సమయాల్లో ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. గోతులు ఒక పక్క, ట్రాఫిక్ మరోపక్క ద్విచకవాహనచోదకులను నానా హైరానా పెడుతోంది. దీంతో ఈ మార్గంలో ప్రయాణం అంటే హడలిపోతున్నారు.



రహదారి మధ్యలో ఏర్పడిన గుంతలు

తరచూ ఇబ్బందులు



తరచూ ఈ మార్గం మరమ్మతులకు గురవుతోంది. హిందూజా పవర్‌ప్లాంట్‌కు చెందిన భారీ వాహనాలు, ఫార్మా కంపెనీలకు చెందిన వాహనాలు రాకపోకలు సాగిస్తున్న మార్గంలో పక్కాగా మరమ్మతులు చేపట్టాలి. గుంతలు ఏర్పడడం, ఇనుప ప్లేట్లు తేలడంతో ద్విచక్రవాహచోదకులు అగచాట్లు పడుతున్నారు. వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. జీవీఎంసీ, రైల్వే అధికారులు స్పందించి రహదారి పునర్నిర్మాణం చేపట్టాలి.

– యలమంచిలి చిన అప్పారావు, అగనంపూడి

మరమ్మతులు చేపట్టాలి



ఏలేరు కాలువ వంతెన నుంచి రైల్వే ఫ్లైఓవర్ వంతన వరకు రోడ్డు, వంతెనపై గుంతలు తక్షణమే పూడ్చాలి. వేలాది మంది ఫార్మా ఉద్యోగులతో పాటు లంకెలపాలెం మీదుగా రాకపోకలు సాగించే వివిధ ప్రాంత ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఓపక్క దుమ్ము ధూళి, మరోపక్క గోతులమయంగా మారడంతో ప్రయాణం నరకంగా అనిపిస్తుంది.

– ఎస్.శంకరరావు, ఫార్మాసిటీకాలనీ

పల్లా సేవలు అమోఘం



పల్లా సింహాచలం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి గుడివాడ తదితరులు

కూర్మన్నపాలెం: మాజీ శాసనసభ్యుడు పల్లసింహాచలం సేవలు అమోఘమని పలువురు వక్తలు కొనియాడారు. సింహాచలం సంతాపసభ ఆదివారం యాదవజగ్గరాజుపేటలో జరిగింది. శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పల్లా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, పెతకంశెట్టిగణబాబు,పంచకర్ల రమేష్‌బాబు, బండారుసత్యనారాయణ, విజయశ్రీ, తదిరులు పాల్గొన్నారు. అలాగే మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ శాసనసభ్యుడు చింతలపూడి వెంకటరామయ్య తదితరులు పల్లా తనయుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్‌ను పరామర్శించి సింహాచలం చిత్రపటానికి పూలమాలల వేసి నివాళులర్పించారు.

ఆదిత్యునికి అభిషేకాలు

పెందుర్తి: సుజాతనగర్లోని సూర్యనారాయణస్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువజామున స్వామివారికి పంచ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు చేశారు. అలంకరణ చేసి ప్రత్యేక పూజలు జరిపారు. ఆదిత్యుని కి పంచ హారతి, నక్షత్ర హారతి ఇచ్చారు. ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

క్లుప్తంగా

ఘనంగా గరుడ స్వామి విగ్రహ ప్రతిష్ట



విగ్రహ ప్రతిష్ఠలో ఆలయ కమిటీ ప్రతినిధులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు వాంబే కాలనీలో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత వైకుంఠ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గరుడ స్వామి విగ్రహ ప్రాణ పతిష్ట కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి విశేష పూజలు చేశారు. హోమం జరిపించారు. మహాభిషేకం చేశారు. ఆపై సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి చేతుల మీదుగా విగ్రహ ప్రతిష్ట చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు మణికుమార్ ఆచార్యులు, హరికృష్ణ ఆచార్యులు, ఆలయ కమిటీ ప్రతినిధులు దొడ్డి రమణ, మంత్రి మంజుల, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అనాథ బాలలకు భోజనం వితరణ



బాలలకు భోజనం ఏర్పాటు చేసిన జొన్నకూటి ఫౌండేషన్ ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 88వ వార్డు మంగళపాలెంలోని అనాథ బాలల ఆశ్రమంలో చిన్నారులకు ఆదివారం డాక్టర్ జొన్నకూటి ఫౌండేషన్ ద్వారా మధ్యాహ్న భోజనం, పండ్లు పంపిణీ చేశారు. మామిడి అనిల్‌కుమార్, రెడగన్ దంపతులు వీటిని అందజేశారు. కార్యక్రమంలో డీజే ఫౌండేషన్ ప్రతినిధులు జొన్నకూటి విజయ్‌కుమార్, తోట గోవిందరావు, రెహెల్‌కుమారి, జొన్నకూటి అవినాష్, సఫీ, రోషన్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి

గాజువాక: నాతయ్యపాలెం జంక్షన్ వద్ద ఒక ద్విచక్ర వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాజువాక నుంచి షీలానగర్ వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తి నాతయ్యపాలెం వద్ద హైవే దాటుతున్న మరో వ్యక్తిని బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రోడ్డు దాటుతున్న వ్యక్తి తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన వ్యక్తికి కూడా గాయాలు కావడంతో అపస్మారకస్థితికి వెళ్లిపోయినట్టు పోలీసులు తెలిపారు. కాగా, మృతుని వివరాలు, ద్విచక్రవాహనదారుడి వివరాలు తెలియరాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రాథమిక వివరాలను సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని, చికిత్స కోసం గాయపడిన వ్యక్తిని కేజీహెచ్‌కు తరలించారు.

తాళాలు పగలగొట్టి.. బంగారు నగలు చోరీ



తెరిచి ఉన్న బీరువా తలుపులు

పరవాడ: లంకెలపాలెం రామాలయం వీధికి చెందిన సూరిశెట్టి వెంకటలక్ష్మి ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి చోరీకి పాల్పడినట్లు పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపారు. ఈ చోరీలో బీరువాలో భద్రపర్చిన ఆరున్నర తులాల బంగారు ఆభరణాలు అపహరించినట్లు వెంకటలక్ష్మి ఆదివారం పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. చోరీకి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రామాలయం వీధిలో నివసిస్తున్న వెంకటలక్ష్మి తన పెద్ద కుమార్తెతో కలిసి శనివారం ఉదయం పెందుర్తిలోని బంధువుల ఇంటికి వెళ్లింది. ఆదివారం ఉదయం తన ఇంటి డోర్ తెరిచి ఉన్నట్లు పొరుగువాళ్లు అందించిన సమాచారం మేరకు ఇంటికి చేరుకుంది. మెయిన్ డోర్ తాళాలు పగలగొట్టి, బెడ్‌రూమ్‌లోని సెల్ఫ్‌లో దాచిన తాళాలను తీసి, బీరువా తెరిచి, లాకర్లోని బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా, పరవాడ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. క్లూస్ టీం వేలి ముద్రలను సేకరించింది. చోరీ కేసును అనుమానస్పద కేసుగా నమోదు చేసి, అన్ని కోణాల్లో దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ మల్లికార్జునరావు వెల్లడించారు.

పార్టీ బలోపేతానికి కృషి



మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిని సత్కరిస్తున్న పార్టీ నాయకులు

పెదగంట్యాడ: పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ 75వ వార్డు అధ్యక్షుడు గొందేశి శ్రీనివాస్ రెడ్డి (బుజ్జి) అన్నారు. వైఎస్సార్ సీపీ 75వ వార్డు అధ్యక్షునిగా నియమించడంతో ఆదివారం మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డితో పాటు సమన్వయకర్త తిప్పలదేవన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ వార్డులోని ప్రతి ఒక్కరినీ కలుపుకొని పార్టీ బలోపేతానికి పాటు పడతానని చెప్పారు. కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, గొందేశి వెంకటరమణారెడ్డి, పిట్టా రెడ్డి, గొందేశి పైడిరెడ్డి, గొందేశి అప్పలరెడ్డి, అండిబోయిన అప్పారావు, పిట్టా రమణ తదితరులు పాల్గొన్నారు.

హాస్యంలో జంధ్యాలది ప్రత్యేక ఒరవడి



మాట్లాడుతున్న జంధ్యాల ఆప్తమిత్రుడు, ప్రముఖ నటుడు డాక్టర్ ఎం.సి.దాస్



డాక్టర్ దాస్‌ను సత్కరిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్, రఘురామారావు తదితరులు

సీతంపేట: జంధ్యాల సినిమాల్లో హాస్యం లోక విధితమని, ఆయన హాస్యం గురించి పరిచయం అక్కర్లేదని జంధ్యాల ఆప్తమిత్రుడు, ప్రముఖ నటుడు డాక్టర్ ఎం.సి.దాస్ అన్నారు. విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గండికోట రఘురామారావు అధ్యక్షతన 'హాస్యానికి భాష్యం చెప్పిన జంధ్యాల' అనే అంశంపై ఆయన ప్రధాన వక్తగా ప్రసంగిస్తూ జంధ్యాలతో తనకున్న తీపి జ్ఞాపకాలు, హాస్య సంభాషణలు, సినిమాలోని సంఘటనలు సభకు వివరించారు. ఈ సందర్భంగా దాస్ మాట్లాడుతూ ప్రతి రోజూ ఉదయం జంధ్యాల నుంచి ఫోన్ వచ్చేదని, ఒక్కోసారి రాత్రిళ్లు గంటల తరబడి మాట్లాడుకునే వారమని గుర్తు చేసుకున్నారు. అప్పట్లో జంధ్యాల ఎస్.ఆర్. కళాశాలకు నల్ల అంబాసిడర్‌లో వెళ్లేవారని, జంధ్యాల ఎక్కడ ఉన్నా అక్కడ స్నేహితులు గుంపులుగా ఉండేవారన్నారు, కాలేజీ రోజుల నుంచే నాటకాలు రాసేవారని, ఆయన రాసిన నాటకాలకు తాను దర్శకత్వం వహించేవాడినని తెలిపారు. జంధ్యాల పూర్తి పేరు జంధ్యాల వీర వెంకట శివ శుబ్రహ్మణ్యశాస్త్రి అని, ఏరా శాస్త్రి అని పిలిచేంత చనువు తనకు ఉండటం అదృష్టమన్నారు. నరసాపురంలో 1951లో జన్మించిన జంధ్యాల 1974లో సినీరంగప్రవేశం చేశారన్నారు. స్నేహం అనేది జంధ్యాల సంపదగా భావించేవారని, తన సినిమాల్లో స్నేహితులతో జరిగిన సంభాషణలు వాడేవారని గుర్తు చేశారు. జనవరి 14 జంధ్యాల జయంతి, జూన్ 19 వర్ధంతిని అయన వీరాభిమానులు, తెలుగు రాష్ట్రాల ప్రజలు జరుపుతున్నారని తెలిపారు. మండలాధీశుడు చిత్రంతో కోట శ్రీనివాసరావుకు సినిమా ఛాన్సులు తగ్గిపోతే అహనా పెళ్లంట చిత్రంతో మరల పునర్జన్మ ఇచ్చారని గుర్తు చేశారు. ఆచార్య వి.బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ జంధ్యాల హాస్యం గురించి మననం చేసుకునే అవకాశం విశాఖ రసజ్ఞ వేదిక కల్పించడం అదృష్టమని తెలిపారు. జంధ్యాల హాస్యం ఎంతో ఆహ్లాదంగా ఉంటుందన్నారు. అనంతరం ప్రధాన వక్త ఎం.సి.దాస్‌ను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. విశ్రాంత ఆచార్యులు పిల్లా రమణమూర్తి సన్మానపత్రాన్ని చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో మేడా మస్తాన్‌రెడ్డి, ఎల్లాప్రగడ శ్రీనివాసకుమార్, పలువురు సాహితీవేత్తలు, జంధ్యాల అభిమానులు పాల్గొన్నారు.

స్టాపర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

కొమ్మాది : బీచ్‌రోడ్డులోని రామానాయుడు స్టూడియో సమీపంలో స్టాపర్‌ను ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. పీఎంపాలెం సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కంచరపాలెం అరుంధతినగర్‌కు చెందిన జి.ఈశ్వరరావు (34) ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో రికవరీ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. అతని భార్య జి.అనిత నగరంలోని బంగారు నగల విక్రయ దుకాణంలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నారు. శనివారం సాయంత్రం ఉద్యోగరీత్యా ఈశ్వరరావు భీమిలి వెళ్లాడు. రాత్రి సమయంలో తిరిగి వస్తుండగా యోగాంధ్ర కోసం రామానాయుడు స్టూడియో సమీపంలో ఏర్పాటు చేసిన స్టాపర్‌ను బలంగా ఢీకొట్టాడు. దీంతో రోడ్డుపై దూరంగా ఎగిరిపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు సీఐ తెలిపారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణతులసీ దళాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ తులసీ దళార్చనను ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం అనంతరం 108 స్వర్ణ తులసీదళాలతో అష్టోత్తర శతనామావళి పూజ జరిపారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేష వస్త్రాలను అందించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుంచారు. ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేష వస్త్రాలను అందించారు.

పర్యావరణంపై అవగాహన ర్యాలీ



చేపల మార్కెట్‌లో అవగాహన ర్యాలీ

కూర్మన్నపాలెం: పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై తిరుమలనగర్ వాసులు ఆదివారం వివిధ ప్రాంతాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్‌ను నిషేధించాలని, గుడ్డసంచులు వాడాలంటూ నినాదాలు చేశారు. కాలువలు, రహదారులు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, పరిసరాల్లో మురుగు నిల్వలేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వడ్లపూడి చేపలమార్కెట్, ఇతర ప్రాంతాల్లో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో తిరుమలనగర్ సంక్షేమసంఘం పెద్దలు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతో సంతృప్తి



సత్యసాయి పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్-1లోని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారి సుప్రభాతం, నగర సంకీర్తన అనంతరం నారాయణ సేవ కోసం వేకువజామున అన్నప్రసాదం సిద్ధం చేశారు.అనంతరం అచ్యుతాపురంలోని మానసిక దివ్యాంగుల పాఠశాలలో వాష్‌రూమ్‌ల శుభ్రం చేశారు.తలుపులు మరమ్మతులు నిర్వహించారు. మధ్యాహ్నం భోజనం అందజేశారు. సాయంత్రం ఉక్కునగరంలో సత్యసాయి భక్తుల నడుమ పల్లకీ సేవ ఉత్సాహంగా జరిగింది. సమితి కన్వీనర్ జి. రామకృష్ణ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలతో సంతృప్తి లభిస్తుందన్నారు. కార్యక్రమంలోఎస్.కె. ఆర్.కె. రాజు, ఎస్.ఎం. విష్ణుమూర్తి, పద్మతో పాటు పదాధికారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బీహెచ్‌ఈఎల్ యాజమాన్యానికి సమ్మె నోటీసు

గాజువాక: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలకు నిరసనగా వచ్చేనెల 9న అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న సమ్మెకు మద్దతుగా బీహెచ్‌ఈఎల్ కార్మిక సంఘాలు ఆ సంస్థ యాజమాన్యానికి సమ్మె నోటీసు అందజేశాయి. లేబర్ కోడ్స్ రద్దు, పీఎఫ్ డేట్ ఆఫ్ జాయినింగ్, హయ్యర్ పెన్షన్, కాంట్రాక్టు కార్మికులకు రూ.26వేల కనీస వేతనం తదితర డిమాండ్లపై బీహెచ్‌ఈఎల్ కార్మిక సంఘాల నాయకులు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యాలయంలో సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు జీ.టి.పి.ప్రకాష్, పి.శివరాం, బి.కృష్ణమూర్తి, సీతమ్మనాయుడు, వారాడ ఆనందరావు, మురళీశ్వరరావు, పి.వి.ఎస్.రాజు, ఎస్.సాహు, బి.బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళల చెస్ టైటిల్ హేమిషా కైవసం



హేమిషా, కుమారి మధ్య ఆసక్తికరంగా సాగుతున్న పోరు

విశాఖ స్పోర్ట్స్: జిల్లా మహిళల చదరంగం చాంపియన్‌షిప్‌ను ఎస్.హేమిషా కైవసం చేసుకుంది. జి.కుమారి రన్నరప్‌గా నిలిచింది. ఆదివారం శ్రీ కశ్యప్ జూనియర్ కళాశాలలో ఆల్ విశాఖ చెస్ సంఘం ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. మొత్తం 63 మంది మహిళా చదరంగ క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో ఆరుగురు ఫిడే ర్యాంకింగ్ సాధించిన వారు ఉండటం విశేషం. టోర్నీలో రెండో ర్యాంక్‌తో (1656 ఫిడే రేటింగ్) బరిలోకి దిగిన జి.కుమారి, చివరిదైన ఆరో రౌండ్‌లో మూడో ర్యాంక్‌తో ఆడిన ఎన్.హేమిషా (1490 రేటింగ్)తో డ్రాగా ముగించింది. పాయింట్లలో సమానంగా నిలిచినప్పటికీ, టైబ్రేకర్స్‌లో కుమారి వెనుకబడటంతో హేమిషా విజేతగా నిలిచింది. ఈ పోటీల్లో టి.బంధవిక, డి.దివ్య (1463), హెచ్ఎస్ బుష్రా ఐదు పాయింట్లు సాధించినప్పటికీ, టైబ్రేకర్లలో వెనుకబడి జిల్లా జట్టుకు ఎంపిక కాలేకపోయారు. ఎరీనా కాండిడేట్ మాస్టర్ ఎం.మనస్వి(1489)తో పాటు ప్రవల్లిక, ఆశ్రిత, లలిత్యా నాలుగున్నరేసి పాయింట్లతో టోర్నీని ముగించారు. ఆసక్తికరంగా ఫిడే రేటర్ మనస్వికి జిల్లా జట్టులో స్థానం దక్కలేదు. మరో వైపు ఆరీనా ఫిడే మాస్టర్ ఎస్.గౌర్లి పోటీలకు హాజరు కాకపోవడం గమనార్హం. ఈ చాంపియన్‌షిప్‌లో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన వారికి ఎన్టీఆర్ జిల్లాలో జరగనున్న ఏపీ అంతర్ జిల్లాల మహిళల చాంపియన్‌షిప్‌కు అర్హత లభించింది.

సత్ప్రవర్తనతో మెలగండి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ సత్యనారాయణ

తాటిచెట్లపాలెం: రౌడీషీటర్లు తమ నడివడికను మార్చుకుని సత్ప్రవర్తనతో మెలగాలని ఫోర్త్ టౌన్ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ సీఐ సత్యనారాయణ సూచించారు. ఆదివారం స్టేషన్ పరిధిలోని రౌడీషటర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు ఎటువంటి గొడవలు, కొట్లాటల్లో తలదూర్చకుండా మంచిగా నడుచుకోవాలన్నారు. హద్దు మీరితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

మాదకద్రవ్యాలను నిరోధిద్దాం



సైక్లోథాన్‌లో పాల్గొన్న సైక్లిస్టులు

మురళీనగర్: మాదక ద్రవ్యాలను నిరోధిద్దాం అంటూ సైక్లిస్టులు పిలుపునిచ్చారు. నశా ముక్త్ భారత్ పఖ్వాడా జ్ఞాపకార్థ ఎన్‌సీబీ, ఈగిల్ సంస్థలు సంయుక్తంగా చేపట్టిన విశాఖపట్నం సైక్లోథాన్ కార్యక్రమంలో భాగంగా విశాఖపట్నం నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో మత్తుకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహించింది. ఇందులో భాగంగా ఆదివారం సైక్లోథాన్‌ను విజయవంతంగా నిర్వహించారు. జూన్ 26వ తేదీన అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవంగా ఐక్యరాజ్య సమితి ప్రకటించిన నేపథ్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సైక్లోథాన్‌ను పంకజ్ కుమార్ ద్వివేది జెండా ఊపి ప్రారంభించారు. విశాఖపట్నం సూపరింటెండెంట్ రాజన్ కుమార్, ఈగిల్ ఇన్‌స్పెక్టర్లు ఎస్. రమేష్, కళ్యాణి సమన్వయకర్తలుగా వ్యవహరించారు. సైక్లింగులో వంద మంది పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి



మాట్లాడుతున్న గంట్ల శ్రీనుబాబు

సీతంపేట: చిరంజీవి కళాపరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన మెగా సినీ సంగీత విభావరి ఆద్యంతం ప్రేక్షకులను అలరించింది. మెగాస్టార్ చిరంజీవితోపాటు పలు సినీ హీరోలకు సంబంధించిన పాటలు పాడి గాయనీ గాయకులు మెప్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కందుల నాగరాజు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో కళాకారులకు కొదువలేదన్నారు. ఎంతో మంది గాయనీ గాయకులు పలు వేదికలపై ప్రతిభ పాటవాలు ప్రదర్శిస్తూ మెప్పిస్తున్నారన్నారు. చిరంజీవి కళాపరిషత్ అధ్యక్షుడు గెంబలి జగదీష్ క్రమం తప్పకుండా సంస్థ వార్షికోత్సవంతోపాటు సంగీవ విభావరి నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కళా సంస్థల ప్రతినిధులు గంటి మురళీధర్, చెన్నా తిరుమలరావు, బి.వి.రామ్, రవితేజ, శ్రీనివాస్ పాల్గొన్నారు.